
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 29 నవంబరు 2025



పదోతరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

గుజరాతీపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు గడువు డిసెంబరు 6 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు దాటితే డిసెంబరు 7 నుంచి 9 వరకు రూ.50 అపరాధ రుసుం విధిస్తామన్నారు. అలాగే డిసెంబరు 10 నుంచి 12 వరకు రూ.200, డిసెంబరు 13 నుంచి 15 వరకు రూ.500 చొప్పున అపరాధ రుసుం వసూలు చేస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వెబ్‌సైట్ ద్వారా స్కూల్ లాగిన్ అయి విద్యార్థుల వివరాలు ధ్రువీకరణ చేసి ఫీజు చెల్లించాలన్నారు.



మాట్లాడుతున్న శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు

అంతటా అభివృద్ధి చెందాలి

- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం
- శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతా అభివృద్ధి చెందాలని రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 2019 నుంచి 2022 వరకు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన అంచనాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక ఎమ్మెల్యే గొండుశంకర్, కమిటీ సభ్యులు వరుదు కళ్యాణి(ఎమ్మెల్సీ), ఇతర అధికారులతో సమీక్షించారు. ఆ మూడేళ్లలో అంచనాల అమలు, నిధుల వ్యయం, సాధించిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. హాస్టళ్ల నిర్వహణ, వివిధ పథకాల అమలు, రుణాల మంజూరు, వైద్యసేవలు తదితర అంశాలపై కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు ఆరా తీశారు. వివిధ సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి.. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

● జిల్లాలో హాస్టళ్లను సక్రమంగానే నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం విడుదల చేసిన రూ.4లక్షలు, కలెక్టర్ మంజూరు చేసిన నిధులతో బాత్‌రూమ్‌లు బాగు చేయిస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ డీడీ తెలిపారు. ప్రతీ విద్యార్థికి ప్రొఫైల్ ప్రకారం హాజరు రిజిస్టర్ అవుతోందన్నారు. బీసీ హాస్టళ్లలో ఖాళీలు ఉన్నచోట్ల ఇన్‌చార్జిలను నియమించామని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖలో రూ.6కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో గిరిజన హాస్టళ్ల పనితీరుపై ఇంతవరకూ సమీక్ష నిర్వహించలేదని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. వెంటనే సమీక్ష నిర్వహించాలని, రెండు రోజుల్లో నివేదిక అందజేయాలని చైర్మన్ కోరారు. ● జిల్లాలో వివిధ గ్రూపులకు రూ.1200కోట్లు రుణాలు ఇచ్చామని డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు.

● జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, అమలు చేస్తున్న పోషకాహారం, పిల్లలకు విద్య, మిషన్ వాత్సల్య, బాల్య వివాహాలు, తదితర వివరాలను ఐసీడీఎస్ పీడీ విమల వివరించారు.

● జలజీవన్ మిషన్‌లో భాగంగా (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

రథసప్తమి ఉత్సవాలు

జనవరి 19 నుంచి

- అరసవల్లిలో ఏడు రోజులపాటు నిర్వహణ
- భక్తులకు సత్వర దర్శనమే లక్ష్యం
- నగరాన్ని సుందరంగా అలంకరించాలి
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

అరసవల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'అరసవల్లిలో శ్రీసూర్య నారాయణస్వామి రథసప్తమి ఉత్సవాలు ఈసారి ఏడు రోజులపాటు నిర్వహించాలి. వచ్చే జనవరి 19 నుంచి 25 వరకు వైభవంగా వేడుకల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాల'ని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అధికారులను ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాటుపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. కేంద్రమంత్రి మాట్లాడుతూ.. 'రథసప్తమి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి. భక్తులకు సౌకర్యవంతమైన, సత్వర దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యం కావాలి. దేవస్థానాన్ని, నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి. పండుగ వాతావరణం అనుభూతి పొందాలి. ప్రతి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించాలి. క్యూలైన్ల పై ఒత్తిడి తగ్గించేందుకు ఆన్‌లైన్ టికెట్లు క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకురావాలి. భక్తుల రద్దీని ఏడు రోజులకు విస్తరించేలా ప్రణాళిక సిద్ధం చేయాలి. భద్రత, సౌకర్యాల విషయంలో రాజీలేదు' అని తెలిపారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'ఆలయ ప్రాంగణమంతా సీసీ కెమేరాల నిఘా ఉండాలి. ఉచిత లడ్డూతోపాటు కోవా వంటి నాణ్యమైన వైవిధ్య ప్రసాదాల పంపిణీపై కూడా దృష్టి సారించాల'ని తెలిపారు. ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి హాజరయ్యే అవకాశం ఉన్నందున.. అందుకు తగిన విధంగా ప్రొటోకాల్, భద్రతా ఏర్పాట్లు చేయాలని రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆహ్వాన పత్రాలు పంపాలని అధికారులు (మిగతా 6వ పేజీలో..)

కిడ్నీవ్యాధుల పరిశోధనకు సిద్ధం

ఎమ్మెల్యే శిరీషను కలిసిన డాక్టర్ రవిరాజ్ బృందం

పలాస, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో కిడ్నీవ్యాధులపై పరిశోధనకు రంగం సిద్ధమైంది. కిడ్నీవ్యాధుల మూలాల పరిశోధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం బృందం సభ్యులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిశారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులను గుర్తించడానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. రెండేళ్లపాటు ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో డాక్టర్ రవిరాజ్ బృందం ఉద్దానం గ్రామాల్లో వివిధ పరిశోధనలు చేయనుంది. ఇప్పటికే పలాస కిడ్నీ పరిశోధనకేంద్రం ద్వారా రోగులకు మెరుగైన డయాలసిస్ సేవలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం పరిశోధనలకు రూ.6కోట్ల నిధులు విడుదల చేసింది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తమ గ్లో సంస్థ ద్వారా ఆధునిక పరికరాలుతోపాటు ఐదు డయాలసిస్ యూనిట్లతో సహకారం అందిస్తున్నారు. ఎమ్మెల్యే శిరీష విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ రవిరాజ్ బృందానికి 'ఉద్దానం కిడ్నీ వ్యాధులపై పూర్తి అవగాహన ఉంది. వ్యాధుల మూలాలు కనుగొనడానికి ఆయన చేస్తున్న చర్యలు ప్రశంసనీయం. వైద్యబృంద సభ్యులు పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో పర్యటించి.. పరిశోధనలు చేయనున్నారు. రక్త నమూనాలు సేకరించే వైద్య బృందానికి ప్రజలు సహకరించాల'ని తెలిపారు.



ఎమ్మెల్యే గౌతు శిరీషకు కిడ్నీ వ్యాధులపై నివేదిక పత్రాలు అందిస్తున్న డాక్టర్ రవిరాజ్, వైద్యబృందం

బెధర గొడుతున్నాయ్

- పెరిగిన కూరగాయల ధరలు
- ఏదైనా కిలో రూ.60 నుంచి రూ.80పైనే..
- బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలు



నరసన్నపేట/టెక్కలి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'ఏమిటీ మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు తీసుకురావాలా?. వాటి ధరలు వింటేనే గుండెలు గుభేలుమంటున్నాయి తెలుసా. కూరలు వద్దు. కాస్త చారు, పచ్చడితో గడిపేద్దాం. మరోరోజు పప్పుచారు, అప్పడాలతో సర్దుకుపోదాం'. ఇదీ ప్రస్తుతం సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో జరుగుతున్న సంభాషణ. ఎన్నడూలేని విధంగా కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఇటీవల వర్షాలకు కూరగాయ పంటలు దెబ్బతినడంతో వాటికి గిరాకీ పెరిగింది. ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ.60 నుంచి రూ.80 పలుకుతోంది. మరికొన్ని ధరలు రూ.100 నుంచి రూ.120 ఉన్నాయి. కార్తీకమాసం ముగిసినా కూరగాయల ధరలు తగ్గకపోవడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. కిలో కొనాల్సిన వారు పావు, అర కిలోతో సరిపెట్టుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో టమోటా కిలో రూ.80, వంకాయలు రూ.80, బీరకాయలు రూ.70 నుంచి రూ.80, పందిరి చిక్కుడు రూ.120, క్యారెట్ కిలో రూ.60 నుంచి రూ.70, బెండకాయలు కిలో రూ.70, అరటికాయ ఒకటి రూ.10, బంగాళదుంపలు కిలో రూ.25 నుంచి రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. అలాగే క్యాబేజీ పువ్వు ఒకటి రూ.40 నుంచి రూ.50, మునగకాయలు కిలో రూ.200 చొప్పున విక్రయాలు సాగిస్తున్నారు. రైతుబజారుల్లో కూడా బయట మార్కెట్ కన్నా కిలోపై రూ.5 నుంచి రూ.10లోపు మాత్రమే తక్కువ ధరలు ఉంటున్నాయి. దీంతో నాలుగైదు రకాల (మిగతా 6వ పేజీలో..)

కొండెక్కిన కోడిగుడ్డు

- హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.6.90
- రిటైల్‌గా రూ.8వరకూ విక్రయం



కాశీబుగ్గ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కూరగాయల బాటలోనే కోడిగుడ్డు ధర కూడా పరుగులెడుతోంది. ఎప్పుడూ రూ.5 నుంచి రూ.5.50లోపు ఉండే కోడిగుడ్డు ధర ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.6.90 పలుకుతోంది. రిటైల్‌గా రూ.7.50 నుంచి రూ.8 చొప్పున విక్రయిస్తున్నారు. జిల్లాలో రోజుకు 15 లక్షల కోడిగుడ్లు వినియోగిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. పెరిగిన ధరతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం తప్పడం లేదు. వాస్తవానికి ట్రేడర్లు ఈ గుడ్డు ధరను నిర్ణయిస్తారు. గుడ్డుకు ఉండే గిరాకీ, మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని ధర నిర్ధారిస్తారు. ప్రస్తుతం పేపరు ధరకు మించి గుడ్లను విక్రయిస్తున్నారు. వినియోగదారులపై భారం మోపుతున్నారు. వ్యయప్రయాసలు పడి రైతులు కోళ్లను పెంచి గుడ్లను ఉత్పత్తి చేయిస్తే.. ట్రేడింగ్ కంపెనీలు, ఏజెంట్లు దోచుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రుచికరంగా ఉండాలని..

- పాఠశాలలో డైట్‌చార్జీల పెంపు
- మెనూపై విద్యార్థుల్లో హర్షం

మెళియాపుట్టి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టేలా ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' పేరిట అధికంగా నిధులు ఖర్చు చేసినా ప్రయోజనం కనిపించలేదు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం కూడా సక్రమంగా అందలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం మెరుగ్గా అమలు చేసేలా దృష్టి సారించింది. మెనూ మార్చి సన్నబియ్యంతో అన్నం పెడుతోంది. విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందిస్తోంది. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు పెరగడంతో తాజాగా ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ (మిగతా 6వ పేజీలో..)



నేలబొంతు పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ఇరుకు దారితో.. ఇక్కట్లు

- రణస్థలంలో హైవేపై రాకపోకలు నిలిపివేత
- ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో సర్వీసు రోడ్డుకు ట్రాఫిక్ అనుసంధానం
- దారి పొడవునా ఇసుక, మట్టి పోగులు
- తరచూ ప్రమాదాలతో భయాందోళన



రణస్థలం మండలం ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా జాతీయ రహదారిని మూసివేసి ఇలా అప్రోచ్ రోడ్డుకు అనుసంధానం చేశారు. పాత పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇలా డైవర్షన్ ఇవ్వగా రోడ్డుపై ఇసుక మేటలు తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరుకుగా ఉండే ఈ సర్వీసు రోడ్డుపై వేలాది వాహనాలు రాకపోకలు సాగించడం ప్రమాదకరంగా మారింది.

రణస్థలం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రణస్థలంలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైవేపై రాకపోకలు నిలిపేసి.. సర్వీసు రోడ్లకు అనుసంధానం చేయగా వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విశాఖ జిల్లా ఆనందపురం నుంచి నరసన్నపేట వరకూ జాతీయ రహదారి ఆరులేన్లుగా విస్తరించి ఆరేళ్లు అవుతోంది. అయితే రణస్థలం మండల కేంద్రానికి వచ్చేసరికి బైపాస్ నిర్మాణమంటూ హడావుడి నడిచింది. వైసీపీ పాలనలో వివాదాల్లో నిలిచిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంతో ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.242 కోట్లు మంజూరు చేసి టెండర్లు కూడా ఖరారు చేసింది. ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. గత ఏప్రిల్ నుంచి పనులు జరుగుతున్నాయి. వరద కాలువల నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఇప్పుడు వంతెన ప్రధాన భాగంలో హైవేను మూసి వేసి సర్వీసు రోడ్లలో వాహనాల రాకపోకలకు అనుమతిచ్చారు. ఈ నెల 11 నుంచి (మిగతా 6వ పేజీలో..)

ఎర్రబందను తవ్వేస్తున్నారు

- యథేచ్ఛగా కంకర అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు

సరుబుజ్జిలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి మండలం చిగురువలస పంచాయతీ లక్ష్మీపురంలోని ఎర్రబందలో కంకర అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సర్వే నెంబర్ 17/2లో సుమారు 2.94 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఎర్రబంద విస్తరించి ఉంది. ఈ ప్రాంతమంతా కంకర లభిస్తుండడంతో అక్రమార్కులు దీనిపై కన్నేశారు. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా రాత్రీ పగలూ కంకర తవ్వకాలు చేపట్టి.. ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీలతో పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ లోడు రూ.వెయ్యి నుంచి రూ.1,500కు విక్రయిస్తున్నారు. లారీ, టిప్పర్ల లోడు అయితే రూ.6వేల నుంచి రూ.8వేల వరకు విక్రయిస్తూ అక్రమార్జన సాగిస్తున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నా రెవెన్యూ, గనులశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎర్రబందపై కంకర క్వారీ నిర్వహిస్తే ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం వస్తుందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

● ఈ విషయమై తహసీల్దార్ ఎల్.మధుసూదన్ వద్ద ప్రస్తావించగా.. 'ఎర్రబందలో కంకర తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. గనులశాఖ ఇటువంటి క్వారీలకు అనుమతి ఇవ్వాల్సి ఉన్నా, ప్రభుత్వ భూమి అయినందున సంబంధిత రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి. ఎన్‌వోసీ కోసం కూడా ఏ ఒక్కరూ మమ్మల్ని సంప్రదించలేదు. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపడతామ'ని తెలిపారు.



ఎర్రబందలో కంకర అక్రమ తవ్వకాలు

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి
● శివారు భూములకు కూడా నీరందించడమే లక్ష్యం
● కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
6లో

ఏడేళ్ల తర్వాత..
● నువ్వలరేవు అప్రోచ్ రోడ్డుకు మోక్షం
● 30 గ్రామాల రాకపోకలకు అనుకూలం
6లో

లేఖ రాయండి.. విజేతగా నిలవండి
● తపాలాశాఖ ఆధ్వర్యంలో 'ఢై అఖర్' పోటీలు
● డిసెంబరు 8వరకు దరఖాస్తుకు గడువు

'వంశధార' పూర్తితో జిల్లా సస్యశ్యామలం
● గత వైసీపీ నిర్లక్ష్యంతోనే ఆలస్యం
● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
8లో

ఏడేళ్ల తర్వాత..

- నువ్వలరేవు అప్రోచ్ రోడ్డుకు మోక్షం
- 30 గ్రామాల రాకపోకలకు అనుకూలం



టీడీపీ హయాంలో నువ్వలరేవు ఉపుటేరుపై నిర్మించిన వంతెన



నువ్వలరేవులో వంతెన ఆనుకుని నిర్మించనున్న అప్రోచ్ రోడ్డు

వజ్రపుకొత్తూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నువ్వలరేవ ఉప్పుటేరుపై నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రజలు సుముఖత వ్యక్తం చేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఏడేళ్ల తర్వాత ఎమ్మెల్యే గౌతుశిరీష చొరవ తీసుకుని నువ్వలరేవు గ్రామస్థులను ఒప్పించడంతో సమస్య పరిష్కారం అయింది. వజ్రపుకొత్తూరు మండలం మధ్యలో ఉప్పుటేరు పారుతుండడంతో 30 గ్రామాల ప్రజలు.. మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. దీంతో వీరు అనేక ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2014లో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ ఈ సమస్య పరిష్కారానికి రూ.50 కోట్లు మంజూరు చేయించారు. ఉప్పుటేరుపై వంతెన నిర్మాణం చేపట్టారు వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇందులో భాగంగా మంచినీళ్ళ గ్రామం వైపు అప్రోచ్ రోడ్డు నిర్మించిన అధికారులకు.. నువ్వలరేవు వైపు నిర్మాణానికి ఇబ్బందులు కలిగాయి. ముఖ్యంగా 105 వరకు ఇళ్ల తొలగించాల్సి ఉండడంతో పాటు నిర్వాసితులు గ్రామం దగ్గనే ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో సమస్య నెలకొంది. ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడంతో అప్రోచ్ రోడ్డు పనులు ముందుకు సాగలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చాక నువ్వలరేవు వైపు అప్రోచ్‌రోడ్డు నిర్మాంచాలని నిర్ణయించింది. అనేకమార్లు అధికారులు, నాయకులు గ్రామస్థులతో సమావేశం అయ్యారు. చివరకు ఎమ్మెల్యే శిరీష, పలాస ఆర్డీవో వెంకటేష్‌తో కలసి నువ్వలరేవు గ్రామస్థులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. దీంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. ఇది పూర్తయితే మత్స్యకారులతో పాటు 30 గ్రామాల ప్రజలు ఎంతో ప్రయోజనం ఉంటుంది.

నిర్వాసితులు ఖాళీ చేసిన వెంటనే పనులు ప్రారంభం..

నిర్వాసితులు ఇళ్లను ఖాళీ చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఆరునెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం. అప్రోచ్ రోడ్డుకు సంబంధించి టెండర్ పక్రియ పూర్తయినందున స్థలం అప్పగించిన వెంటనే పనులు మొదలు పెడతాం.

-జగదీష్. ఆర్అండ్‌బీ ఈఈ



లేఖ రాయండి.. విజేతగా నిలవండి

- తపాలాశాఖ ఆధ్వర్యంలో 'దై అఖర్' పోటీలు
- డిసెంబరు 8వరకు దరఖాస్తుకు గడువు

కోటబొమ్మాళి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, పౌరుల్లో దాగిఉన్న లేఖ రచన నైపుణ్యాన్ని వెలికితీసేందుకు తపాలా శాఖ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టుంది. పిలాటెలీ (తపాలా బిళ్లల సేకరణ) ప్రమోషన్‌లో భాగంగా ఈ పోటీల నిర్వహణకు సన్నద్ధమైంది. 2025-26 ఏడాదిలో 'దై అఖర్ ఉత్తరాల రాత పోటీని జాతీయ స్థాయిలో నిర్వహిస్తోంది. 'లెటర్ టు మై రోల్ మోడల్ అనే అంశంపై తెలుగు, ఆంగ్లం, హిందీతో పాటు అన్ని ప్రాంతీ య భాషల్లో ఉత్తరాలు రావచ్చు. 18 ఏళ్ల లోపు, 18 ఏళ్ల వయసు దాటిన వారిని రెండు విభాగాలుగా చేసి ఈ పోటీలు నిర్వహిస్తారు.

సొంత దస్తూరీతో..

ఇన్‌లాండ్ కవర్‌పై రాసేవారు 500 పదాలు పంపించాలని, ఏ4 సైజ్ పేపర్ పై రాసేవారు వెయ్యి పదాలు మించకుండా రాసి ఎన్వలప్ కవరులో పెట్టి పంపించాలి. రాసినవారి పూర్తి వివరాలు ఉండాలి. పేరు, చిరునామా, వయస్సు, పాఠశాల/కళాశాల పేర్లతోపాటు ఫోన్ నెంబరు తప్పనిసరిగా రాయాలి. ఇలా రాసిన ఉత్తరాలను డివిజన్‌లోని ప్రధాన కార్యాలయమైన సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ (ఎస్‌పీ కార్యాలయం) శ్రీకాకుళం గాని, సమీపంలోని తపాలాశాఖ కార్యాలయాలకు గాని పంపించాలి. రాసే ఉత్తరాల్లో సంతకంతో పాటు వయసు రాయాలి, చిరునామా పైన ఎంట్రీ ఫర్ ధాయి అఖర్ 2025-26 అని రాసి పోస్టు చేయాలి. ఈ పోటీలకు డిసెంబరు 8వ తేదీ వరకు గడువు ఉంది.

బహుమతులు ఇలా..

జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిస్తే రూ.50వేలు, ద్వితీస్థానంలో నిలిస్తే రూ.25వేలు, తృతీయ స్థానంలో నిలిస్తే రూ.10వేలు ఇస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.25వేలు, ద్వితీయ స్థానంలో నిలిస్తే రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిస్తే రూ.5వేలు ఇస్తారు. దీనిపై కోటబొమ్మాలి పోస్టు మాస్టర్ మాట్లాడుతూ.. ఈ లేఖా రచన పోటీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీప తపాలా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

నైపుణ్యాన్ని వెలికితీసేందుకే..

విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఈ పోటీలు తపాలా శాఖ జాతీయస్థాయిలో నిర్వహిస్తుంది. అందువల్ల ఈ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి వివరాలకు సమీప తపాలా కార్యాలయంలో సంప్రదించాలి.

-కింజరాపు రేవంత్, పోస్టు మాస్టర్, కోటబొమ్మాళి

ఆదిత్యుని ఆశీస్సులు రాష్ట్రంపై ఉండాలి

- శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు



అరసవల్లి: శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో ప్రసాద్

అరసవల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆశీస్సులు జిల్లా, రాష్ట్ర ప్రజలపై ఉండాలని శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావు ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే గొండు శంకర్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, డిప్యూటీ సెక్రటరీ రాజ్‌కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ భిక్షం, సెక్షన్ అధికారి శ్రీచరణ్‌తో కలిసి ఆదిత్యుడిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా జోగేశ్వరరావు మాట్లాడుతూ.. సూర్యదేవుని దర్శించుకోవడం తన అదృష్టమని, స్వామివారి ఆశీస్సులతో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీకూర్మక్షేత్రం అద్భుతంగా ఉంది..

గార, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాధుని క్షేత్రం అద్భుతంగా ఉందని, ఈ స్వామిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. ఆలయంలోని శిల్పసంపదను చూసి ముగ్ధులయ్యారు. క్షేత్రంలో ఉన్న రెండు ధ్వజస్తంభాలను చూసి వాటి విశేషాలను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్వేతపుష్కరిణిని సందర్శించారు. ఆయన వెంట ఎమ్మెల్యే గొండు శంకర్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, ఈవో నరసింహనాయుడు ఉన్నారు.



సతీష్ విజయానందం

ఏసియన్ బాడీబిల్డింగ్ పోటీల్లో సిక్కోలు కుర్రాడి ప్రతిభ

- కాంస్య పతకంతో సత్తాచాటిన సతీష్

నరసన్నపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కంబకాయి గ్రామానికి చెందిన పాగోటి సతీష్ ఏసియన్ బాడీబిల్డింగ్ పోటీల్లో కాంస్య పతకంతో సత్తాచాటినట్టు కోచ్ కళింకోట చిరంజీవి తెలిపారు. వరల్డ్ స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు థాయ్‌లాండ్‌లోని పటాయ్ పట్టణంలో ఈ పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం జరిగిన 70-75 కిలోల విభాగంలో సతీష్ మూడో స్థానంలో, జూనియర్ విభాగంలో నాలుగో స్థానంలో నిలిచినట్టు తెలిపారు. ఈ విభాగంలో మొత్తం 18 మంది పాల్గొనగా సతీష్ మూడో స్థానంలో నిలిచారన్నారు. కాగా సతీష్ తండ్రి పోగోటి వెంకట్రావు వ్యవసాయం చేస్తుండగా.. తల్లి పార్వతి గృహిణి, సతీస్ ఏసియన్ పోటీల్లో ప్రతిభ చూపడంపై ఆ గ్రామ పెద్దలు అప్పలనాయుడు, ఉమామహేశ్వరి, కుసుమ, బైరి మహేంద్ర, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- శివారు భూములకు కూడా నీరందించడమే లక్ష్యం
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పాత, కొత్త సాగునీటి ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జలవనరుల శాఖ అధికారులతో ఆయన శుక్రవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి శివారు భూములకు సాగునీరు అందించడమే లక్ష్యం కావాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. వంశధార ప్రాజెక్టు పనుల పురోగతి, నేరడి బ్యారేజీ తాజా పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. హిరమండలం రిజర్వాయర్‌కు నిరంతరాయంగా నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 95 శాతం పనులు పూర్తి కావడంపై అధికారులను అభినందించారు. బ్యారేజీ ఆప్రాన్ పనుల పూర్తి చేసేందుకు అవసరమైన రూ.12కోట్ల మంజూరుకు ప్రభుత్వంతో మాట్లాడతానని అన్నారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ ఆధునికీకరణ 90 శాతం పూర్తయిందని, భూసేకరణ బిల్లులు రూ.22కోట్లు చెల్లించకపోవడంతో మిగిలిన పనులు ఆగిపోయినట్లు అధికారులు చెప్పారు. పెండింగ్ బిల్లులపై నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. మహేంద్ర తనయ (ఆఫ్‌షోర్ రిజర్వాయర్) పనుల్లో వేగం పెంచాలని, చిన్నచిన్న అడ్డంకులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాల్లోని 108 గ్రామాలకు సాగునీరు అందుతుందని, ఇప్పటివరకు 45 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. నాగావళి-వంశధార నదుల అనుసంధానం, కరకట్టల పెండింగ్ పనులు, మడ్డువలస రిజర్వాయర్, సైరిగాం, కళింగదళ్, ఓనిగెడ్డ తదితర మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై కూడా మంత్రి సమీక్షించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం డే అండ్ నైట్ వంతెన వద్ద నాగావళి నదిలో చేపడుతున్న డైక్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్ఈలు పి.సుధాకరరావు, జి.రామచంద్రరావు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు దారితో.. ఇక్కట్లు

(ఐదో పేజీ తరువాయి)

శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్లే మార్గంలో తహసీల్దారు కార్యాలయం నుంచి పాత పోలీస్‌స్టేషన్ వరకూ, విశాఖ నుంచి శ్రీకాకుళం వచ్చే రహదారిలో పాతపోలీస్‌స్టేషన్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకూ జాతీయ రహదారిని మూసివేశారు. సర్వీసు రోడ్లకు ట్రాఫిక్‌ను అనుసంధానం చేశారు. అయితే అవి ఇరుకు రోడ్లు కావడం, వాటిపై మట్టి, ఇసుక వంటి వాటిని తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీసు రోడ్లకు ట్రాఫిక్‌ను అనుసంధానించి రెండు వారాలు దాటుతున్నా వాటి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ మార్గంలో ఇసుకతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

- **చర్యలు చేపడతాం..**

వంతెన నిర్మాణ పనులు శరవేగంగా చేస్తున్నాం. హైవేను మూసివేసి సర్వీసు రోడ్లకు ట్రాఫిక్‌ను అనుసంధానించాం. ఇసుక పోగులతోపాటు జంగిల్ క్లియరెన్స్ చేస్తాం. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

-రాధాకృష్ణ, ప్రాజెక్టు మేనేజర్



అలంకరణలో రామలింగేశ్వరస్వామి

రామలింగేశ్వరునికి భస్మాభిషేకం

టెక్కలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వమించారు. ఈ సందర్భంగా స్వామివారికి భష్మాభిషేకం చేపట్టారు.. అర్చకులు తర్లా శివకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను జరిపించారు.

అన్ని అనుమతులు తీసుకోవాలి

కాశీబుగ్గ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ బస్‌లకు అన్ని అనుమతులతో కూడిన ధ్రువ పత్రాలు ఉంచుకోవాలని పలాస మోటార్ వెహికల్ అధికారి (ఎంవీఐ) శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కాశీబుగ్గ, చినబాడాం జంక్షన్ వద్ద ప్రైవేట్ బస్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 4వతేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బస్‌లు తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. మొత్తం 30 ప్రైవేట్ బస్సులను తనిఖీ చేశామని, పత్రాలు లేని వాహనాలకు నోటీస్‌లో అందజేశామన్నారు. వారంరోజుల్లో అన్ని అనుమతులు పొందాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.



బస్సులు తనిఖీ చేస్తున్న ఎంవీఐ

అంతటా అభివృద్ధి చెందాలి

(ఐదో పేజీ తరువాయి)

పాతపట్నం, శ్రీకాకుళం, టెక్కలి నియోజకవర్గాల్లో కొన్ని పనులు రద్దయ్యాయని, వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కమిటీని కోరారు.

- డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత మాట్లాడుతూ జిల్లాలో అన్ని 104, 108 వాహనాలు కండీషన్‌లో ఉన్నాయని తెలిపారు.
- పాఠశాల అకౌంట్లకు నేరుగా నిధులు జమవుతున్నాయని, నిర్వహణ విషయంలో సమస్యలు లేవని డీఈవో తెలిపారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.
- జిల్లాలో రైతులకు అందిస్తున్న పథకాలు, సేవలు, సబ్సిడీల గురించి వ్యవసాయాధికారి త్రినాథస్వామి వివరించారు. ఇటీవల తుఫాన్ కారణంగా జిల్లాలో 1,627 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అంచనాల కమిటీ సభ్యులు రాజాకుమార్, వి.భిక్షం, సెక్షన్ అధికారి టి.చిరంజీవి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఇన్‌చార్జి డీఆర్వో లక్ష్మణమూర్తి, ఆర్డీవో సాయిప్రత్యూష, జడ్పీ సీఈవో సత్యనారాయణ, సీపీఓ ప్రసన్నలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బె'ధర' గొడుతున్నాయ్

(ఐదో పేజీ తరువాయి)

కూరగాయాలను కొనుగోలు చేయాల్సిన వినియోగదారులు వాటి ధరలను చూసి ఒకట్రెండు రకాలతో సరిపెట్టుకుంటున్నారు. సాధారణంగా శీతాకాలంలో కూరగాయల ధరలు అందుబాటులో ఉంటాయి. కాగా ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గింది. ఆకు కూరలు ఆచూకీ ఎక్కడా కనిపించడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. కూరగాయల సాగు పెరిగి.. ఉత్పత్తులు అందుబాటులోకి వస్తే ధరలు తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

జనవరి 19 నుంచి రథ'సప్తమి' ఉత్సవాలు

(ఐదో పేజీ తరువాయి)

తీర్మానించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. ఏడు రోజుల ఉత్సవాలు నిర్వహణతో జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని తెలిపారు. ఉత్సవాల ప్రారంభం రోజున సూర్య నమస్కారాలు, శోభాయాత్రతో పాటుగా ఏడు రోజులపాటు రాష్ట్రస్థాయి ఆటలు పోటీలను నిర్వహించాలని ప్రతిపాదించారు. కార్పొరేషన్ అధికారులు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. శ్రీకాకుళం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని చాటడమే లక్ష్యంగా ఈ సప్తహ సూర్య మహోత్సవం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో లక్షణమూర్తి, ఆర్డీవోలు సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, గణేష్, డీఎస్పీ వివేకానంద, అరసవల్లి ఈవో ప్రసాదరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రుచికరంగా ఉండాలని..

(ఐదో పేజీ తరువాయి)

విద్యార్థులకు సంబంధించి డైట్‌చార్జీల ధరలను కూడా పెంచింది. జిల్లాలోని 2,955 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు 1,63,115 మంది చదుతున్నారు. అలాగే 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 39వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో 1 నుంచి 5వ తరగతిలో ఒక్కో విద్యార్థికి డైట్ చార్జీ రూ.5.45 ఉండగా దానిని ప్రస్తుతం రూ.6.19కి పెంచారు. అలాగే ఆరో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు పాత ధర రూ.8.29 ఉండగా, దానిని రూ.9.29కి పెంచి అందజేస్తున్నారు. మరింత మెరుగ్గా మెనూ అమలుకానుందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ మెనూ..

- సోమవారం అన్నం, ఆకుకూరల పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- మంగళవారం అన్నం, రసం, గుడ్డు, కూర, రాగిజావ
- బుధవారం వెజ్ పలావ్, బంగాళాదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
- గురువారం అన్నం, సాంబారు, గుడ్డు కూర, రాగిజావ
- శుక్రవారం పులిహోర, చట్నీ, గోంగూర, కూరగాయలు, ఉడికించిన గుడ్డు
- శనివారం అన్నం, కూర, రసం, రాగి జావ, పొంగల్‌ను విద్యార్థులకు మెనూగా పెడుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఈశ్వరరావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

లావేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం పెదలింగాలవలసలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన ప్రతి రైతుకూ ఇప్పటివరకు రూ.14 వేలు అందజేసినట్లు తెలిపారు. లావేరు మండలంలో ఈ ఏడాది 9,200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాకు నగదు జమవుతుందని తెలిపారు. ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కూనపల్లి దామోదరరావు, తహసీల్దార్ జీఎల్‌వీ శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.వెంకటరాజు, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో మహేష్, సర్పంచ్ అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎమ్మెల్యే రవికుమార్



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఆమదాలవలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని చంద్రశేఖర్, పొట్నూరు రమేష్, సనపల డిల్లీశ్వరరావు, సిమ్మ మాధవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

● ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. రాజపురంలో గ్రిగ్స్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాసుదేవ్‌ప్రదాన్, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారావు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



రాజపురంలో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రతి హామీని నెరవేరుస్తున్నాం

● విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీ కలిశెట్టి

రణస్థలం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేరుస్తున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి రణస్థలంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాటా్లడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని రైతులకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ డైరెక్టర్ ముక్కు ఆదినారాయణ, కూటమి నాయకులు డీజీఎం ఆనంద రావు, దెయ్యం వసంతరావు, దెయ్యం శ్రీనివాసరావు, కలిశెట్టి సూర్యనా రాయణ, కనకారావు, గంగి హరి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లావేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అమ్మాజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో వెంకటరాజు తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సోంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సోంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని సోంపేట, బెంకిలి, జింకిభద్ర గ్రామాలకు ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తామని బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇ.అనూరాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు డిసెంబరు 3వ తేదీ లోగా శ్రీకాకుళం వాంబే కాలనీ వద్దనున్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని అన్నారు. మరిన్ని వివరాలకు 8332 52106 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

తోటపల్లి ఆధునికీకరణ పనులను కొనసాగించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులను కొనసాగించాలని, జంపరకోట ప్రాజెక్టుకు నిధులను మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావుకు శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. నాయకులు బుడితి అప్పలనాయుడు, కిమిడి రామ్మూర్తినాయుడు, పి.వైకుంఠరావు, జి.కాశినాయుడు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన అవసరమని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ వైవీ శివకుమార్ అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆర్‌టీఐ చట్టంపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ చట్టంపై పూర్తి పరిజ్ఞానం ఉన్నప్పుడే దరఖాస్తుదారులకు సకాలంలో సమాచారం అందజేయగలరని అన్నారు. సిబ్బంది అడిగిన పలు సందేహాలను ఆర్‌టీఐ రిసోర్స్‌పర్సన్ వసంత్‌కుమార్ నివృత్తి చేశారు. అన్ని విభాగాల పౌర సమాచార అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీలు ప్రారంభం

బూర్జ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బాలబాలికల గ్రిగ్స్ పోటీలు శుక్రవారం ప్రారంభయ్యాయి. ఎంఈవో నారాయణరావు, తోటవాడ పాఠశాల పీడీ మన్మథరావు ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. ఎంపీపీ కర్నేన దీప, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు పోటీలను ప్రారంభించారు. ఎంపీడీవో తిరుపతిరావు, ఎస్ఐ ప్రవల్లిక, ఎంపీటీసీ సభ్యుడు పోలినాయుడు, సర్పంచ్ అనురాధ పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

రణస్థలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వల్లభరావుపేట గ్రామానికి చెందిన మీసాల రమణమ్మ ఇంట్లో ఇటీవల మూడు తులాల బంగారు ఆభరణాలను చోరీ చేసిన బొంతు రామకృష్ణను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. శుక్రవారం రామకృష్ణను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

రణస్థలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చౌదరి బాబ్జీ, ముప్పిడి సురేష్, బెందు మల్లేశ్వరరావు, కొమరాపు రవి, డీజీఎం ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులను పూడ్చండి

● మున్సిపల్ సమావేశంలో కోరిన సభ్యులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ఇచ్ఛాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాత బస్టాండ్ జంక్షన్‌లో ఎర్రన్న కూడలి వద్ద రోడ్డుపై ఉన్న గోతులతోను ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే వాటిని పూడ్చాలని 11వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ఆశి లీలారాణి తదితర సభ్యులు కోరారు. శుక్రవారం మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన మునిసిపల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన ఆరు అంశాలను సభ్యులు ఆమోదించారు. 2025 అక్టోబరు 1 నుంచి 31 వరకు మునిసిపాల్టీ ఆదాయం, వ్యయాన్ని కౌన్సిల్ ఆమోదించింది. జీరో అవర్‌లో పలు అంశాలకు సంబంధించి అధికారులను కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. బస్టాండ్ జంక్షన్‌లో గోతులను పూడ్చాలని ఫిర్యాదుచేసి నెలలు గడుస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఇదివరకే గోతులు పూడ్చాలని ఆర్అండ్‌బీ అధికారులకు చెప్పినా స్పందించలేదని, మరోసారి చెబుతామని అన్నారు. 23 వార్డుల్లో ఆవులు, కోతులు, కుక్కల బెడద కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని వైస్‌చైర్‌పర్సన్లు లాభాల స్వర్ణమణి, ఉలాల భారతి దివ్య అధికారులను కోరారు. 2024లో డంపింగ్ యార్డు కోసం రూ.24లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులు ఏమయ్యాయని 23వ వార్డు కౌన్సిలర్ ప్రదీప్ ప్రశ్నించారు. సమావేశంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

రైతు సేవలపై రగడ

● గ్రామసభలు లేకుండా ఉపాధి పనులు ఆమోదమా? ● మండల సమావేశంలో వైసీపీ-టీడీపీ నాయకుల తీవ్ర వాగ్వాదం



అధికారులతో వాగ్వాదం చేస్తున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

ఇచ్ఛాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు సేవా పథకాలు సక్రమంగా అమలు కావడంలేదని వైసీపీ ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. దీంతో వైసీపీ-టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి అజయ్‌కుమార్ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయా మాట్లాడుతూ.. మొంథా తుఫాన్ కారణంగా తులసిగాం, ధర్మపురం గ్రామాల్లో ఎంత పంట నష్టం జరిగింది, ఎంత శాతం నమోదు చేశారని ఏవోను ప్రశ్నించగా.. 96 హెక్టార్లు అని ఆయన సమాధానం చెప్పారు. ఈరెండు గ్రామాల్లో ఈ క్రాప్ సక్రమంగా జరగలేదని, కూటమి నాయకులు చెప్పిన వారి పేర్లు మాత్రమే ఈ క్రాప్‌లో నమోదు చేసి మిగిలిన వారిని వదిలేశారని, అందువల్లే పంట నష్టం నమోదు పూర్తిస్థాయిలో జరగలేదని, యూరియా కూడా రైతులకు ఇవ్వలేదని వైసీపీ సర్పంచ్‌లు తులసీరావు, నర్తు ప్రసాద్ అన్నారు. దీనిపై టీడీపీకి చెందిన పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జీ స్పందిస్తూ.. వైసీపీ నాయకుల మాటలు అవాస్తవమని అన్నారు. దీంతో ఇరు పార్టీల ప్రతినిధుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామ సభలు నిర్వహించకుండా ఉపాధి హామీ పనులకు ఆమోదం తెలపడంపై కేశుపుర, తులసిగాం, లొద్దపుట్టి, ఈదుపురం గ్రామ సర్పంచ్‌లు ఏపీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామరావు, ఏఎంసీ చైర్మన్ మణిచంద్రప్రకాష్, ఎంపీడీవో ప్రభాకరరావు, తహసీల్దార్ ఎన్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకి ఘన నివాళి



వర్సిటీలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ రజని తదితరులు



బార్ అసోసియేషన్ హాల్‌లో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ఎచ్చెర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక సంఘసంస్కర్త, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తదితరులు నివాళులర్పించారు. బాలికల విద్యకు ప్రాధాన్యం ఇచ్చి ప్రత్యేకంగా పాఠశాలలను స్థాపించిన మహోన్నత వ్యక్తి పూలే అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, పూర్వపు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాళ్లు రాజశేఖరరావు, కె.స్వప్నవాహిని, ఎస్‌వో సామ్రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

● శ్రీకాకుళం లీగల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి న్యాయవాదులు నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పటిష్ఠతకు కృషి చేయాలి

ఆమదాలవలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు సూర్‌సింగ్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో నిర్వహించిన కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతం, నియోజకవర్గ స్థాయి కమిటీలు, డీసీసీ అధ్యక్షుడి నియామకంపై కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, నాయకులు లక్కరాజు రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీల్లో 'శారద' విద్యార్థుల సత్తా



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

శ్రీకాకుళం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సింగుపురంలో జరిగిన మండల స్థాయి గ్రిగ్స్ ఆటల పోటీల్లో శారద విద్యానికేతన్ విద్యార్థులు సత్తాచాటారు. సీనియర్స్ కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన బాలబాలికలు విజేతలుగా నిలిచారు. జూనియర్ వాలీబాల్ పోటీలో కూడా గెలుపొందారు. ఖోఖోలో జూనియర్ బాలికలు, బ్యాడ్మింటన్‌లో సీనియర్ బాలురు, విజయకేతనం ఎగురవేశారు. వీరిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడి

కంచిలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఎంఏవో సురేష్ అన్నారు. అంపురం గ్రామానికి చెందిన రైతు గడ్డం కృష్ణారావు వరి పొలంలో శుక్రవారం పంట కోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలన్నారు. దీనివల్ల పెట్టుబడి తక్కువ అవుతుందన్నారు. పంటకు కావాల్సిన పోషకాలు లభ్యమవుతాయని వివరించారు. కార్యక్రమంలో మండల యాంకర్ శివానందం, ఎల్‌టూ కామరాజు, పీహెచ్‌ఏ శాంతి, అంపురం యూనిట్ ఆర్‌పీలు పాల్గొన్నారు.

అద్భుతం ఈ వీణ వేణుగానం



వీణ వాయిస్తున్న ఫణి నారాయణ

అరసవల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఆరామ ద్రావిడ సంఘం, శ్రీసుమిత్ర కళా సమితి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇప్పిలి జోగారావు జయంతి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఏర్పాటు చేసిన ఫణి నారాయణ వీణ గానం ఆహూతులను ఆద్యంతం మంత్రముగ్ధులను చేసింది. వేణువుపై శ్రీరామచంద్రమూర్తి, కీబోర్డుపై ప్రవీణ్, ప్యాడ్స్‌పై మెహర్ వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా కళాకారులను మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు, నిర్వాహకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు ఘనంగా సత్కరించారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య



భర్త అంత్యక్రియలు నిర్వహిస్తున్న భార్య దమయంతి

ఇచ్ఛాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భర్తకు భార్య తలకొరివి పెట్టిన ఘటన ఇచ్ఛాపురంలో జరిగింది. పట్టణంలోని కార్జీ వీధికి చెందిన రోకల్ల తారకేష్(52) అనే వ్యక్తి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య దమయంతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహం జరిగి దూర ప్రాంతాల్లో ఉంటున్నారు. వారు అందుబాటులో లేకపోవడంతో భార్య దమయంతి భర్తకు బాహుదా నది వద్ద శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించి తలకొరివి పెట్టింది.

నైపుణ్యాలను వెలికితీసేందుకే 'అస్మిత' పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాలికల్లో ఉన్న నైపుణ్యాలు, శక్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు అస్మిత పోటీలు దోహదపడతాయని రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు అన్నారు. కోడిరామ్మూర్తి స్టేడియంలో శుక్రవారం అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న అస్మిత పోటీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం విజేతలకు ప్రశంసా ప్రతాలు, పతకాలను అందజేశారు. పోటీల పరిశీలకుడు జమీల్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సలహాదారు పి.సుందరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.మాధవరావు, రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి వితరణ

సోంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శబరిమలలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం కార్యక్రమానికి రూ.4లక్షల విలువచేసే సరుకులను స్థానిక భక్తులు శుక్రవారం వితరణ చేశారు. సోంపేట, కవిటి, కంచిలి, మందస మండలాలకు చెందిన అయ్యప్ప మాలధారులు వీటిని సమకూర్చారు.

'వంశధార' పూర్తితో జిల్లా సస్యశ్యామలం

- గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆలస్యం
- 12 టీఎంసీల నీరు అందేలా చర్యలు
- ఎత్తిపోతలతో రిజర్వాయర్ నింపేలా ఏర్పాట్లు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వంశధార ప్రాజెక్టు పూర్తయితే జిల్లా సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, ఇందులో భాగంగానే సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించిందన్నారు. ఈ మేరకు శుక్రవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రధాన జీవనాధారమైన వంశధార ప్రాజెక్టు రూపకల్పనలో గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాల వల్ల రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందకుండా పోయిందని, వేల కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ ప్రాజెక్టు రూపకల్పనలో నేరడి బ్యారేజీ అత్యంత కీలకమైందని, దీన్ని సాంకేతికంగా, న్యాయపరంగా అడ్డంకులు తొలగినప్పటికీ ఇంకా కొన్ని అవరోధాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని అధిగమించడానికి ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయంగా రిజర్వాయర్ నింపడానికి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. 2023 సంవత్సరంలో గత వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేసినా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో పూర్తి కాలేదని, చేసిన పనులకు నిధులు కూడా మంజూరు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.176కోట్లు నిధులు చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా గొట్టా బ్యారేజీ నుంచి 12 టీఎంసీల నీటిని వంశధార రిజర్వాయర్‌లోకి పంపించి వరద సమయాల్లో వృథా నీటిని జాగ్రత్త చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వంశధార కుడి కాలువకు 2.4 కిలోమీటర్ల వద్ద ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మొదలయ్యాయన్నారు. రిజర్వాయర్ నిండితే వంశధార ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతుందన్నారు. అలాగే కూటమి ప్రభుత్వ లక్ష్యం మేరకు వంశధార, నాగావళి నదులు అనుసంధానం పూర్తయితే మరింత భూమిసాగులోకి వస్తుందన్నారు. అలాగే ఉద్దానం తాగునీటి పథకానికి అవసరమైన నీరు అందడంతో పాటు జిల్లా ప్రజల చిరకాల నీటి సమస్యల తీరిపోతాయని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా ప్రజల తరుఫున ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతుల తెలుపుతున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ

- తల్లి మృతి.. కుమారుడికి గాయాలు


భానుమతి(ఫైల్)

ఆమదాలవలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలోని వంతెనపై శుక్రవారం స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో తల్లి మృతి చెందగా కుమారుడికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. బూర్జ మండలం కొల్లివలస గ్రామానికి చెందిన సున్నగొప్పల మణికంఠ తన తల్లి భానుమతితో కలిసి స్కూటీపై కొల్లివలస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తుండగా ఆమదాలవలస ఫ్లైఓవర్‌పై శ్రీకాకుళం వైపునుంచి పాలకొండ వైపు కొబ్బరికాయల లోడుతో వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో భానుమతి అక్కడికక్కడే మృతి చెందగా, మణికంఠకు తీవ్రగాయాలయ్యాయి. ఆమదాలవలస పోలీసులు అక్కడకు చేరుకొని విచారణ చేయగా, ప్రమాదం జరిగిన స్థలం శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండడంతో వారికి సమాచారం అందించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్ వాసి మృతి


పంచారామ్(ఫైల్)

కవిటి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్.కరాపాడు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన పంచారామ్(28) అనే వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ వి.రవివర్మ వివరాల మేరకు.. స్థానిక టోల్‌గేట్ సమీపంలోనున్న రాజస్థాన్ దాబాలో పంచారామ్ పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న పంచారామ్‌ను శిలగాం వైపు నుంచి రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను 108వాహనంలో ఇచ్ఛాపురం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..


వైకుంఠరావు (ఫైల్)

నందిగాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురైన బడగాం గ్రామానికి చెందిన బమ్మిడి వైకుంఠరావు(49) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వైకుంఠరావు గత నెల 22న పొలంలో చేస్తుండగా పాము కాటువేసింది. దీంతో అతడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం రిఫర్ చేయగా.. శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అయినా ఫలితం లేకపోయింది. వైకుంఠరావుకి భార్య, వివాహమైన కుమార్తె, డిగ్రీ చదువుతున్న కుమారుడు ఉన్నారు. కాగా ఈయన నిరుపేద కావడంతో గ్రామస్థులంతా ఆర్థిక సహాయం సుమారు లక్ష రూపాయలు సాయం అందించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నందిగాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లట్టిగాం గ్రామ సమీపాన జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండల కేంద్రానికి చెందిన బొమ్మాళి సుదర్శనరావు తన అత్తవారి గ్రామమైన హరిదాసుపురం వెళ్లేందుకు లట్టిగాం వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా పలాస వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న కోటబొమ్మాళికి చెందిన లండ శ్రీనివాసరావు ఢీకొన్నాడు. ఈ ఘటనలో సుదర్శనరావుతో పాటు ద్విచక్రవాహనంపై వస్తున్న శ్రీనివాసరావు, అతడి భార్య సంధ్య, కుమార్తె పావని గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. సుదర్శనరావు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. సుదర్శనరావు బావమరిది తలగాన బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ జిన్నారావు తెలిపాం.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పది మందికి జరిమానా

నందిగాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన పది మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ టెక్కలి కోర్టు న్యాయాధికారి మాధురి శుక్రవారం తీర్పు చెప్పినట్టు ఎస్‌ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలానికి చెందిన కొల్లి సీతయ్య, రాజు చౌదరి, కొర్నాన దుర్యోధన, మట్ట మోహనరావు, అంబోడి జోగారావు, శిర్ల ప్రసాద్, తెంబూరు సోమేశ్వరరావు, సనపల రామారావు, కోమటూరు భాస్కరరావు, దుప్పలపూడి శంకరరావు వేర్వేరుగా డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే పది రోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మళ్లీ మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు.

- టెక్కలి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసుకు సంబంధించి ఇద్దరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ టెక్కలి కోర్టు న్యాయాధికారి యు.మాధురి తీర్పు చెప్పినట్టు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. 2024లో పట్టుబడిన టెక్కలికి చెందిన తలగాపు బాబూరావు, మాకువరం గ్రామానికి చెందిన అరసవల్లి రవికి జరిమానా విధించారు.

ఆటో డ్రైవర్‌కు ఏడు రోజుల జైలు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసులో ఆటో డ్రైవర్ ఎన్ని శ్రీనివాసరావుకు శుక్రవారం ఏడు రోజుల జైలుశిక్ష పడింది. ట్రాఫిక్ సీఐ వానపల్లి రామారావు తెలిపిన వివరాల మేరకు.. గురువారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేటు వద్ద వన్‌వే రోడ్డుపైకి శ్రీనివాసరావు తన ఆటోతో ప్రవేశించాడు. అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆపేందుకు ప్రయత్నించగా శ్రీనివాసరావు ఆటోని వేగంగా ముందుకు నడిపాడు. పోలీస్ సిబ్బందితో ప్రమాదకరంగా ప్రవర్తించాడు. దీంతో శ్రీనివాసరావుపై పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఈ మేరకు ఆయనకు ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్టు సీఐ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై టూటౌన్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరు యువతులను, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఈశ్వరరావు తెలిపారు.

కల్తీ మద్యం స్వాధీనం


సీజ్ చేసిన కల్తీ మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ సిబ్బంది

సరుబుజ్జిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఆర్ వైన్ షాప్‌పై శుక్రవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 10.88 లీటర్ల కల్తీ మద్యం గుర్తించినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. లీటరు పరిమాణం గల తొమ్మి ది వాటర్ బాటిళ్లలో నింపిన కల్తీ మద్యంతో పాటు నీరు కలిపి ఉన్న 11 నిబ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఆ సమయంలో షాపులో విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు, శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశా మన్నారు. కల్తీ మద్యం బాటిళ్లతో పాటు నిందితులను ఆమదాలవలస ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించి నట్టు తెలిపారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పల్ల మురళీధర్‌తోపాటు సిబ్బంది రమణ, విజయ్, వెంకటేష్, గాలిబ్ ఈ దాడుల్లో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

- వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే గౌతు శిరీష


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలాస నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు పరిశీలించి కొన్ని అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాస్, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌ను వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/పోలాకి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు ప్రజాదర్బార్‌ను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శుక్రవారం పోలాకి మండలం కత్తిరివానిపేటలోగల తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజవర్గంలో నాలుగు మండలాలు నుంచి వచ్చిన పలు అర్జీలను పరిశీలించి పరిష్కరించారు. కొత్తగా ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం ఆయా సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని అర్జీదారులకు సూచించారు.

పేదోడికి అండగా కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పేదోడి అండగా కూటమి ప్రభుత్వ ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేపట్టి మాట్లాడారు. ఆపదలో ఉన్న ప్రతీ పేదోడికి కూటమి ప్రభుత్వం ఆపన్నహస్తం అందిస్తుందన్నారు. బూరగాం గ్రామానికి చెందిన రాజా బిస్వాల్ అనారోగ్యానికి గురై వైద్యానికి సాయం కోసం ఎమ్మెల్యేను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.96,274 మంజూరు చేయించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో ఇబ్బంది పెట్టొద్దు


మిల్లర్లతో మాట్లాడుతున్న రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు

నరసన్నపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ట్రక్కుషీట్ ఆధారంగా వచ్చే ధాన్యాన్ని మిల్లులు వద్ద అన్‌లోడింగ్ చేయాలన్నారు. నూకలు ఎక్కువగా వచ్చే ధాన్యాన్ని ఎలా తీసుకోవాలని మిల్లర్లు ప్రశ్నించారు. కార్యక్రమంలో డీటీ పి.శ్రీనివాసరావు, సీఎస్‌డీటీ.రామకృష్ణ, మిల్లర్ల అసోసియేషన్ నాయకులు ఊణ్న భార్గవ్, తంగుడు జోగారావు, తంగుడు సీతారాం, కింజరాపు సూర్యనారాయణ, ఎస్.శ్రీనివాసరావు, కోరాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై సభ్యుల నిలదీత


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎల్ఎన్ పేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారుల పనితీరుపై సభ్యులు అసం తృప్తి వ్యక్తం చేశారు. విద్య, రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది ప్రజల సమస్య లను పక్కతోవ పట్టిస్తూ ప్రజల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని పీఏసీఎస్ అధ్యక్షుడు కె.మన్మథరావు అన్నారు. పెసర, మినుము, జీలుగు, కట్టుజనుము విత్తనాలు రైతుసేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని ఏవో కిరణ్‌వాణి తెలిపారు. అన్నదాత సుఖీభవ అందుకోని రైతులు వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. వివిధ అంశాల పరిష్కారం కోసం పలువురు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ప్రత్యేకాహ్వానితులు ఆర్.రామారావు, జడ్పీటీసీ కె.త్రినాథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చర్యలు నిలిపివేత

పలాసరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పలాసకు చెందిన రిటైర్డు అసిస్టెంట్ బీసీవెల్ఫేర్ అధికారి హెచ్.కృష్ణారావుపై నమోదైన అభియోగాలు రుజువు కాకపోవడంతో క్రమశిక్షణ చర్యలు నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఎక్స్ ఆఫీషియో కార్యదర్శి ఎస్.సత్యనారాయణ శుక్రవారం జీవోఆర్‌టీ నెంబరు 149 విడుదల చేశారు. 2016 ఆగస్టు 4న శ్రీకాకుళం జిల్లా ఎర్రముక్కాం ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడుల్లో అప్పటి పలాస ఏబీసీడబ్ల్యూవోగా ఉన్న కృష్ణారావుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్ సిఫార్స్ చేశారు. దీనిపై ప్రభుత్వం విచారణ అధికారిని నియమించగా కృష్ణారావుపై నమోదైన అభియోగాలు రుజువు కాలేదని ఆయన నివేదిక ప్రభుత్వానికి సమర్పించారు. దీనిపై సదరు రిటైర్డు అధికారి వివరణను పరిగణనలోకి తీసుకొని తదుపరి చర్యలు నిలిపివేసినట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సబ్సిడీ వాహనాలను వినియోగించుకోవాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై అందిస్తున్న మూడు చక్రాల వాహనాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. నువ్వలరేవు గ్రామానికి చెందిన బైనపల్లి రామచంద్రరావుకు పీఎం మత్స్యసంపద యోజన పథకం ద్వారా మంజూరైన రూ.1.20లక్షలు సబ్సిడీతో అందించిన వాహనాన్ని శుక్రవారం అందజేశారు. అంతకు ముందు నువ్వలరేవు అప్రోచ్ రోడ్డు నిర్వాసితులతో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణచంద్రరావు, ఇన్‌చార్జి ఎఫ్‌డీవో ధర్మరాజు పాత్రో, టీడీపీ నాయకులు వెంకటేష్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి

హిరమండలం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అంతకాపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం పాతపట్నంలో జరిగిని రాజకీయ పార్టీల సమావేశంలో హిరమండలం మండలంలోని పలు కేంద్రాలకు సంబంధించి సమస్యలను జడ్పీ సీఈవోకు వివరించారు. అక్కురాపల్లి పోలింగ్ కేంద్రానికి అంతకాపల్లి గ్రామం నుంచి గిరిజనులు రావాలంటే ఇబ్బంది పడుతున్నారన్నారు. నాయకులు దారపు ఢిల్లేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గోళ్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటి పన్ను వసూలు

టెక్కలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మేజర్‌పంచాయతీ పరిధిలో శుక్రవారం ఇంటిపన్నులు చెల్లింపులు ముమ్మరంగా సాగాయి. ఆధార్, మొబైల్ అనుసంధాన ప్రక్రియ జరిపిస్తూ ఇంటిపన్నులు వసూలు చేస్తున్నట్టు, అలాగే స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు మండల సమావేశం

మందస, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వై.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు అందరూ హాజరుకావాలని, అన్ని శాఖల అధికారులంతా పూర్తి సమాచారంతో రావాలని కోరారు.

శ్మశానవాటిక పరిశీలన

కాశీబుగ్గ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పల్లివీధి దగ్గర ఉన్న శ్మశానవాటికను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని పలాస మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం శ్మశానవాటికను ఆయన పరిశీలించి మాట్లాడారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, చైర్మన్ బల్ల గిరిబాబు ఆదేశాల మేరకు శ్మశానవాటికలో దశలవారీగా పనులు చేపడతామన్నారు. ముందుగా జేసీబీ సాయంతో పిచ్చి మొక్కలు తొలగించామన్నారు. కార్యక్రమంలో అధికారులు కనకరాజు, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు సడలించాలి

నరసన్నపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం రైతులకు ఇబ్బందిపెట్టే చర్యలకు పాల్పడుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో సవాలక్ష నిబంధనలతో రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిబంధనలను సడలించాలని కోరారు. విత్తనం నాటినుంచి పంట అమ్ముకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు. అంతకు మునుపు పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

నరసన్నపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్ స్థాయి నుండే విద్యార్థులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పవన్ అన్నారు. శుక్రవారం ఈఈటీ విద్యార్థులకు మొబైల్‌సర్వీసింగ్ పై అవగాహన నిర్వహించారు. వృత్తివిద్యాకోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఈఈటీ ఎంతో ఉపాధినిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో ఒక మొబైల్ షాపులో సెల్‌ఫోన్ రిపేరింగ్ తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. అధ్యాపకులు నాగకుమారి పాల్గొన్నారు.

వాణిజ్య పంటలతో ఆదాయం

పాతపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రబీలో వాణిజ్యపంటలపై దృష్టిసారిస్తే అధిక ఆదాయం పొందవచ్చని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. కాగువాడలో జరిగిన రైతన్నా మీకోసం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధునిక విధానాలను అనుసయించుకుంటూ ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లి జగదీశ్వరరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గుర్తింపు

పలాస, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైశ్య సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన బోయిన గోవిందరాజులును ఎంపిక చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం మంచి గుర్తింపు ఇచ్చిందని స్థానిక జీడి వ్యాపార సంఘ (పారిశ్రామికవాడ) అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. ఆయనకు చైర్మన్ ఇవ్వడంపై రాష్ట్రంలో కళింగకోమటి సంఘానికి సముచిత స్థానం లభించినట్లయిందన్నారు. గోవిందరాజులకు చైర్మన్‌గా ప్రకటించడం పట్ల జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ, వైశ్యసంఘం గౌరవ అధ్యక్షుడు మల్లా భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్, పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్, కొత్తకోట తిరుమలరావు, జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు టంకాల రవిశంకర్‌గుప్తా హర్షం వ్యక్తం చేశారు.

నిధులు మంజూరు

పోలాకి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట, పోలాకి మండలాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు ప్రాజెక్టు అధికారిణి శోభారాణి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పోలాకి మండలంలోని దండులక్ష్మీపురం, కొత్తరేవు, చల్లబంద, మెట్టపేట, నరసన్నపేట మండల పరిధిలోని జమ్ము, రెడ్డికపేట, నారాయణవలస, సత్యవరం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు మంజూరయ్యాయన్నారు.

బస్‌షెల్టర్ లేక ఇబ్బంది

నందిగాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తురకలకోట జాతీయరహదారి వద్ద బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. తురకలకోట కూడలి నుంచి ఎంతోమంది అటు పలాస, ఇటు టెక్కలి, శ్రీకాకుళం ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కూడలికి తురకలకోటతో పాటు బడగాం, కాశీరాజు కాశీపురం, ఇసంపల్లి, మొగిలిపాడు, బోరుభద్ర, మాదిగాపురం, వెంకన్నపేట తదితర గ్రామాల ప్రజలు వస్తూ పోతుంటారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


పలాస: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


జలుమూరు: మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

పలాస, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో శుక్రవారం సాయంత్రం ఉత్సాహంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, పీఈటీలు పద్మలోచనరావు, ఎస్.చంద్రశేఖర్, వైకె హరినాథ్, రవికాంత్, శంకరరావు, ఆర్.శ్రీనివాస్, గీత పాల్గొన్నారు.

- నరసన్నపేట: మండలం స్థాయిలో గత రెండు రోజులుగా జరుగుచున్న గ్రిగ్స్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. జూనియన్ బాలికల కబడ్డీలో కంబకాయి, బోర్డు స్కూల్, ఖోఖోలో బొరిగివలస, మడపాం, వాలీబాల్‌లో బాడాం, ఉర్లాం, షెటిల్‌లో మడపాం, బడాం పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్ గర్ల్స్ విభాగంలో కబడ్డీలో మడపాం, సుందారపురం, ఖోఖోలో మడపాం, సెయింట్ క్లారెట్, వాలీబాల్‌లో బాడాం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, షెటిల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మడపాం విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలో నిలిచారు. విజేతలకు హెచ్‌ఎం డి.భారతి, పీడీ జగదీష్ , ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. వీరంతా నియోజవర్గ పోటీల్లో పాల్గోనున్నారు.
- పాతపట్నం: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంఈవో-2 సీహెచ్ తిరుమలరావు తెలిపారు. కొరసవాడ జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ తదితర పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం రామారావు, పీఈటీలు కృష్ణారావు, లక్ష్మణరావు, లక్ష్మీనారాయణ, లోకేశ్వరరావు, రజనీకాంత్, రమణ, రవి, పల్లవి తదితరులు నిర్వహించారు. సర్పంచ్ ఉమాదేవి, రిటైర్డు పీడీ మద్దు తాతయ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.
- జలుమూరు: విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో బి.మాధవరావు అన్నారు. కరవంజ మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన గ్రిగ్స్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో 16 పాఠశాలల నుంచి 108 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్, ఎంఈవో-2 ప్రసాదరావు, పలువురు పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో నగరంపల్లి విద్యార్థులు సత్తాచాటారు. ఎనిమిదవ తరగతి చదువుతున్న ఎస్.రాజ్‌కమాల్, తొమ్మిదో తరగతి చదువుతున్న బి.హరిక ప్రతిభ చూపినట్టు హెచ్‌ఎం టి హేమారావు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ఆవరణంలో విద్యార్థులతోపాటు శిక్షకులు గజేంద్రరావు, జె.నారాయణరావు అభినందించారు. అలాగే శనివారం నుంచి గ్రిగ్స్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.